# నమస్తే తెలంగాణ

## మహబూబ్‌నగర్

### నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, గురువారం 18 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET


## ఆకట్టుకున్న ఊయల

ఊట్కూర్, జూలై 17 : యుద్ధంలో వీర మరణం పొందిన మహ్మద్ ప్రవక్త మనుమలు ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్‌ల త్యాగానికి గుర్తింపుగా జరుపుకొనే మొహర్రం (పీర్ల పండుగ ) వేడుకలకు బుధవారం కర్ణాటక, మహారాష్ట్రతోపాటు పలు పట్టణాలు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేలాది మంది భక్తుల రాకతో ఊట్కూర్ మండలకేంద్రంలోని హసన్, హుస్సేన్‌ల పీర్ల చావిడి జనసంద్రంగా మారింది. భక్తులు చక్కెర, పుట్నాలు, గోధుమ పిండితో నైవేద్యం తయారు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు గొర్రెలు, మేకలతో కందూర్లు నిర్వహించారు. నవమి, దశమి రోజులను ప్రత్యేక సంతాప దినాలుగా భావిస్తూ భక్తులు ఉపవాస దీక్షలను కొనసాగించారు. స్థానిక పెద్దపీర్ల మసీదు నుంచి మెయిన్ బజార్, భరత్‌నగర్, బస్టాండ్, శివాజీనగర్ ఏరియా నుంచి పెద్దచెరువు వరకు నిర్వహించిన ఊరేగింపులో భక్తులు చిన్న, పెద్ద బేధం లేకుండా పాల్గొన్నారు. యువకులు అలాయ్ బలాయ్.. అస్సైదుల్లా నినాదాలతో హోరెత్తించారు. మహిళలు బొడ్డెమ్మలు వేశారు. కాగా, పీర్ల సవారీ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఊయల (తొట్ల) కార్యక్రమం విశేషంగా ఆకట్టుకున్నది. బుధవారం ఉదయం, సాయంత్రం వేళ నిర్వహించిన ఊయలను తిలకించేందుకు భక్తులు పిల్లాపాపలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రుద్రనగర్‌లో ఆరెకటిక వంశంలో పుట్టిన పసి బిడ్డలను ఊయలలో వేసి సవారీ చేత నామకరణం చేయించారు. రాత్రికి స్థానిక పెద్ద చెరువు అలుగు కట్టపై పీర్ల అలాయ్ బలాయ్ ఆటలతో వేడుకలకు ముగింపు పలికారు. పేట డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నవీద్ పర్యవేక్షణలో బందోబస్తు కల్పించారు.



ఉమామహేశ్వర ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

## వైభవంగా తొలిఏకాదశి

- ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలతో వ్రతాల ఆచరణ
- లొద్దిమల్లయ్య దర్శనంతో పులకించిన జనం
- కిక్కిరిసిన మన్యంకొండ, కురుమూర్తి, బీచుపల్లి, శ్రీరంగాపురం ఆలయాలు



మన్యంకొండ వెంకన్న దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

## లొద్దిమల్లయ్య దర్శనానికి బారులు

- భక్తుల ఆందోళనతో అనుమతిచ్చిన అటవీశాఖ అధికారులు

అచ్చంపేట, జూలై 17 : నల్లమలలోని లొద్దిమల్లయ్య క్షేత్రాన్ని బుధవారం భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని అటవీశాఖ విధించిన ఆంక్షల మధ్య స్థానిక భక్తులు కాలినడకన వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. బాణాల, చౌటపల్లి మీదుగా కాలినడకతో వెళ్లి భక్తులు లొద్దిమల్లయ్యను చేరుకొని పూజలు చేశారు. మన్ననూర్ మీదుగా వెళ్లిన భక్తులను అటవీశాఖ అధికారులు మార్గమధ్యంలో నిలిపివేయడంతో శ్రీశైలం-హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దాదాపు 2 గంటల పాటు ఆందోళన చేయగా చివరికి అటవీశాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. ఏడాదికి ఒక్కసారి తొలి ఏకాదశి రోజు దర్శనమిచ్చే లొద్దిమల్లయ్యను పూజించాలని భక్తులు ఎంతో ఎదురుచూడగా అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో స్వామి వారిని దర్శించుకొనే వెసులుబాటును ఇవ్వకపోవడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఒక రోజు మాత్రమే అనుమతి ఇవ్వగా భక్తులు గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అయితే ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు నిషేధించడంతో భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు.



లొద్దిమల్లయ్య ఆలయం వద్ద గుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

పాలమూరు, జూలై 17 : మహబూబ్‌నగర్‌లోని ఫాతిమా విద్యాలయం (క్రిష్టియన్ పల్లి), జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల (ధర్మాపూర్)లో డీఎస్సీ పరీక్షలు టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులను ఉదయం 7:30 నుంచి 8:50, మధ్యాహ్నం 12:30నుంచి 1:50 వరకు లోపలికి అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్, ఐడీ ప్రూఫ్స్‌తో సీడబ్ల్యూఎస్ఎన్ వారు సదరం సర్టిఫికెట్‌ను పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా తేవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి పెన్, వాటర్‌బాటిల్ మాత్రమే తేవాలని పేర్కొన్నారు.

## శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై విచారణ

- లక్ష్మీపల్లిని సందర్శించిన మల్టీజోన్-2 ఐజీ
- నిందితులను త్వరలో పట్టుకుంటామని వెల్లడి



లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, పోలీస్ అధికారులు

చిన్నంబావి, జూలై 17 : బీఆర్ఎస్ నేత బొడ్డు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను త్వరలో పట్టుకుంటామని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో శ్రీధర్‌రెడ్డి ఇంటి పరిసరాలను డీఐజీ ఎల్ఎస్‌చౌహాన్, జిల్లా ఎస్పీ గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, పోలీస్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ హత్య కేసుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ జితేందర్ కేసును త్వరగా ఛేదించాలని ఆదేశించినట్లు తెలిపారు. అందులో భాగంగానే తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు చెప్పారు. హత్య జరిగి 56 రోజులు అయినా నేటికీ నిందితులను గుర్తించకపోవడంతో ఈ కేసు విచారణకు డీఎస్పీ కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సభ్యులుగా సీసీఎస్ సీఐ పాల్, ఆత్మకూర్ సీఐ శివకుమార్ ఉంటారన్నారు.

### కేసు ఛేదనలో నిర్లక్ష్యం : ఐజీతో లక్ష్మీపల్లి వాసులు

శ్రీధర్‌రెడ్డి హత్య కేసును ఛేదించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లక్ష్మీపల్లి వాసులు మండిపడ్డారు. హత్య కేసు విచారణకు వచ్చిన ఐజీ సత్యనారాయణతో మాట్లాడారు. హత్య జరిగి దాదాపు రెండు నెలలు కావస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కేసును వేగవంతం చేసి హత్య చేసిన వారిని గుర్తించాలని కోరారు. ఆయనవెంట సీఐ నాగభూషణరావు, ఎస్సై రమేశ్, పోలీసులు ఉన్నారు.

## జూరాల జెన్‌కోలో విద్యుదుత్పత్తి ప్రారంభం



పూజలు చేసి విద్యుదుత్పత్తి ప్రారంభిస్తున్న ఎస్ఈ

ఆత్మకూరు, జూలై 17 : ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదల నేపథ్యంలో జూరాల రిజర్వాయర్‌కు జల కళ సంతరించుకున్నది. దీంతో ఉన్నతాధికారులు బుధవారం జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఎస్ఈ కల్లూరి రామసుబ్బారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఎగువ జూరాలలో సాయంత్రం ఒక్క యూనిట్‌లో, దిగువ జూరాలలో రాత్రి ఒక్క యూనిట్‌లో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతిని బట్టి నేటి సాయంత్రానికి అన్ని యూనిట్లు వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో హసన్, హుస్సేన్ పీర్ల సవారీ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో మొహర్రం

- కనువిందు చేసిన పీర్ల సవారీ
- అగ్నిగుండంలో నడిచిన భక్తులు
- జనసంద్రమైన కోయిలకొండ, ఊట్కూరు, తిమ్మాజిపేట
- ఊరూరా కందూర్లతో మొక్కులు
- నిమజ్జనంతో ముగిసిన ఉత్సవాలు

*మొహర్రం పండుగను బుధవారం ఉమ్మడి జిల్లాలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పెద్ద ఎత్తున జరిగే కోయిలకొండ, ఊట్కూరు, తిమ్మాజిపేట జనసంద్రంగా మారాయి. అలాగే ఆయా గ్రామాల్లో పీర్ల చావిడీలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మలీజా సిద్ధం చేసి పీర్లకు నైవేద్యం సమర్పించారు. మొక్కుబడుల్లో భాగంగా కందూర్లు నిర్వహించారు. సవారీలు కనువిందు చేయగా.. అగ్నిగుండంలో భక్తులు నడిచారు. యువకుల అలయ్.. బలయ్, మహిళల బొడ్డెమ్మలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిమజ్జనంతో ఉత్సవాలు ముగిశాయి.*



## జనసంద్రమైన కోయిలకొండ



ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు (ఇన్‌సెట్లో) కోటపై నుంచి వస్తున్న బీబీ ఫాతిమా పీర్లు

మహబూబ్‌నగర్, జూలై 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కోయిలకొండలో తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న బీబీ ఫాతిమా నిమజ్జనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన కోయిలకొండ మొహర్రం ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వేలసంఖ్యలో భక్తులు కోయిలకొండ కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమాను దర్శించుకొని కందూర్లు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా బీబీ ఫాతిమాకు సర్కారు నుంచి చక్కెరను సమర్పించారు. అనంతరం కోటపై నుంచి పీర్లను కాగడాలు, వాయిద్యాలతో కోట కింది వరకు తీసుకొచ్చారు. పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పా టు చేసిన అగ్నిగుండంలో భక్తులు నడవడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోలాటాలు బొడ్డెమ్మలు, భజనలతో కోయిలకొండ గ్రామం మార్మోగింది. గ్రామంలో దుకాణాలు, సర్కస్‌లు వెలిశాయి. మధ్యాహ్నం బీబీ ఫాతిమా పీర్లతోపాటు గ్రామంలో ప్రతిష్ఠించిన మరో 30 పీర్లను ప్రధాన రహదారిపై ఊరేగిస్తూ కోయిలకొండ పెద్ద చెరువు వద్ద నిమజ్జనం చేయడంతో మొహర్రం ఉత్సవాలు ముగిశాయి. స్థానిక ఎస్సై శ్రీకాంత్‌తో పాటు జిల్లా కేంద్రానికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న పోలీస్ అధికారుల నిఘా మధ్యలో ప్రశాంతంగా మొహర్రం ఉత్సవాలు కొనసాగాయి.

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 17 : మహనీయుల స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకొని వారు చూపిన మార్గంలో నడవాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతికాలనీలో తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడు జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ మహనీయుల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఆలోచనతో తమ హయాంలో జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. ఎరుకల కులస్తులకు కేసీఆర్ ప్రభుత్వంలో 10శాతం రిజర్వేషన్ల పెంపుతో ఆదివాసులు, గిరిజన, కోయ, గోండ్రు, లంబాడీలకు ఎంతో లబ్ధి చేకూరుతున్నదని వివరించారు.

### పండుగ సాయన్న ఆశయాలు కొనసాగించాలి


బహుజన వీరుడు రాబిన్‌హుడ్ పండుగ సాయన్న ఆశయాలను కొనసాగించాలని, ఆయన ఒక ముదిరాజు సామాజిక వర్గానికి కాకుండా బహుజనుల బాగు కోసం పోరాటం చేసిన మహనీయుడని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో పండుగ సాయన్న జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పండుగ సాయన్న చరిత్రను వెలికితీసి రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేశామన్నారు. తన హయాంలో ఆయన విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అనంతరం పండుగ సాయన్న సమాధిని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, నాయకులు శివరాజ్, గణేశ్, రవికిషన్, నవకాంత్, సుధాకర్, మల్లేశ్, సత్యం, కిషన్ పవర్ తదితరులు పాల్గొన్నారు.



పండుగ సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌రెడ్డి

## బేబీ సందడి

- వనపర్తిలో సీబీఎస్ మాల్‌ను ప్రారంభించిన వైష్ణవి చైతన్య



మాల్‌లో చీరతో బేబీ ఫేం వైష్ణవి



సినీ హీరోయిన్ వైష్ణవిచైతన్యతో సీబీఎస్ మాల్ నిర్వాహకులు, కుటుంబసభ్యులు

వనపర్తి టౌన్, జూలై 17 : జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీబీఎస్ షాపింగ్ మాల్‌ను బుధవారం సినీ తార వైష్ణవి చైతన్య, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని రంగ థియేటర్ ఎదురుగా ఉన్న చందన బ్రదర్స్ షాపింగ్ మాల్, జ్యువెలరీ షాపును వారు ప్రారంభించారు. షాపింగ్ మాల్ కలియతిరిగి దుస్తులు, బంగారు ఆభరణాలను ధరించి ప్రదర్శన ఇచ్చారు. అనంతరం బయట ఏర్పాటు చేసిన వేదిక వద్ద అభిమానులకు అభివాదం చేస్తూ పుష్ప, బేబీ సినిమా డైలాగ్‌లతో ఆమె అభిమానులను ఉత్సాహపరిచారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన గావించి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాగల మహేశ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, షాపింగ్ మాల్ నిర్వాహకుడు సురేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ తదితరులు ఉన్నారు.

## సాగుకు కృష్ణమ్మ

- జూరాల కుడి కాల్వకు నీటి విడుదల
- ఆయకట్టు రైతుల సంతోషం



*కృష్ణమ్మ బిరబిరా పరుగులు పెట్టింది.. పంట పొలాలను ఎప్పుడు చేరాలా అన్నట్లు పీజేపీ కుడి కాల్వను ముంచెత్తి గలగల పారింది.. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండగా జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. దీంతో బుధవారం కుడి కాల్వకు ఎమ్మెల్యే బండ్ల నీటిని విడుదల చేశారు. కాల్వ పరిధిలో దాదాపు 36 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. సాగునీటి రాకతో ధరూరు, గద్వాల, ఇటిక్యాల, మానవపాడు రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. - ధరూరు, జూలై 17*